సమాజ సేవకులు ఆర్యవైశ్యులు

మచిలీపట్నంటౌన్: సమాజంలో ఎవరు ఆపదలో ఉన్నా వారికి సాయం అందించడంలో ఆర్యవైశ్యులు ముందుంటారని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం విజయవాడ రోడ్డులోని ఓ కల్యాణ మండపంలో కృష్ణా జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘాల సమాఖ్య నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన ఆర్యవైశ్య సంఘ నాయకులు మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమాజ సేవా కార్యక్రమాలను వివరించారు. సంఘాలకు ప్రత్యేకమైన నిధులేమీ లేకున్నా పాలకవర్గం సేవా కార్యక్రమాలు చేస్తూ ముందుకు సాగుతోందని చెప్పారు. ఆర్యవైశ్య సంఘం యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సన్నిధి నాగసాయి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సమాఖ్య జిల్లా అధ్యక్షుడు వేముల కృష్ణ, ప్రధాన కార్యదర్శి జల్లూరి గోపీనాథ్, అదనపు ప్రధాన కార్యదర్శి మానేపల్లి సత్యసాయి, కోశాధికారి సామా రవిచంద్, ఉపాధ్యక్షులు, ప్రాంతీయ కార్యదర్శులు, పలు విభాగాల చైర్మన్లను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. నూతన పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. నూతన పాలకవర్గ సభ్యులను వైఎస్సార్ సీపీ నాయకులు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, కార్పొరేటర్ చిత్తజల్లు ప్రసన్న, మాజీ కౌన్సిలర్ యర్రా శ్రీనివాస కుమార్ అభినందించారు. సమావేశంలో నగరానికి చెందిన ఆర్యవైశ్య ప్రముఖులు హాజరై నూతన పాలకవర్గాన్ని సత్కరించారు.


జిల్లా అధ్యక్షుడు కృష్ణకు అభినందనలు తెలుపుతున్న పేర్ని కిట్టు తదితరులు

ఆకట్టుకున్న పౌరాణిక నాటకాల ప్రదర్శన

మచిలీపట్నంటౌన్: నగరానికి చెందిన దుర్గా మల్లేశ్వరి కళాపీఠం వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం రాత్రి స్థానిక బెల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆడిటోరియంలో నిర్వహించిన పౌరాణిక నాటకాల సన్నివేశాల ప్రదర్శన కళాభిమానులను ఆకట్టుకున్నాయి. వార్షికోత్సవం సందర్భంగా బాలనాగమ్మ నాటకం నుంచి సంగు, మాయలఫకీర్ సీన్, శ్రీ కృష్ణరాయబారం నాటకం నుంచి కర్ణ సందేశం సీన్, పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. దుర్గా మల్లేశ్వరి కళాపీఠం అధ్యక్షుడు చలమలశెట్టి గాంధీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ కళాకారులు విజయవాడకు చెందిన గుమ్మడి జీవనకుమార్, త్రినాథ్‌నాయుడు, గుడివాడకు చెందిన సంగప్పు కోటేశ్వరి, కొడాలి రాజా, విన్నకోట సత్యనారాయణ, మచిలీపట్నానికి చెందిన శీలం మస్తానరావులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి తెలుగు భాషా సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షుడు పైడిపాటి రాందేవ్, మచిలీపట్నం రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేముల సూరిబాబు, గుడివాడ పట్టణ కళాకారుల సమాఖ్య గౌరవాధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ కళాకారులను ప్రోత్సహించేందుకు పౌరాణిక నాటకాలను ఆదరించాల్సిన అవసరం ఉందన్నారు. రాజుల కాలం నుంచి కళాకారులకు ప్రత్యేక గౌరవం ఉందన్నారు. రానున్న రెండేళ్ల పాటు ఐదుగురు పేద కళాకారులకు నెలకు వెయ్యి రూపాయల చొప్పున పెన్షన్ అందజేస్తామని రాందేవ్, గాంధీ, బాలాజీ తెలిపారు.


కళాకారులను సన్మానిస్తున్న నిర్వాహకులు

క్లుప్తంగా

రేపు సామాజిక తనిఖీ ప్రజావేదిక

మోపిదేవి: సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామని ఎంపీడీఓ పార్వతి తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2021–2022 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై చర్చిస్తారని చెప్పారు. మండల, గ్రామ స్థాయి ప్రజా ప్రతినిధులు, అధికారులు, సంబంధిత సిబ్బంది, ఉపాధి కూలీలు, మేట్లు, గ్రామస్తులు పాల్గొనాలని కోరారు.

విద్యార్థినికి సాయం



చిలకలపూడి(మచిలీపట్నం): ఆదివెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేద విద్యార్థినికి ఆర్థికసాయం అందజేశారు. సంఘ సభ్యులైన సూరత్తు పాండురంగారావు విద్యా నిధి నుంచి జూనియర్ ఇంటర్ బైపీసీ చదువుతున్న విద్యార్థిని మాదిరెడ్డి తనూజతేజకు రూ. 20 వేల చెక్కును సంఘ అధ్యక్షులు పిళ్లారిశెట్టి శ్రీనివాసరావు చేతుల మీదుగా ఆదివారం అందజేశారు. సంఘ సభ్యులకు విద్యార్థిని తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

క్యాన్సర్ వ్యాధిగ్రస్తునికి రూ.25 వేలు అందజేత



పెడన: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న మచిలీపట్నం డ్రైవర్స్ కాలనీకి చెందిన మిరియాల రవికుమార్‌కు పెడన సహాయ ఫౌండేషన్, మచిలీపట్నానికి చెందిన లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ వారి సంయుక్త ఆధ్వర్యంలో రూ.25 వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు ఉస్మాన్ బాషా, ఫౌండేషన్ లీగల్ సెల్ చైర్మన్ లంకిశెట్టి బాలాజీ, మాజీ కౌన్సిలర్ లంకిశెట్టి వనజ, అజయ్, నాని, మహేష్, సుధీర్ పాల్గొన్నారు.

నేటి నుంచి కప్పలదొడ్డిలో గడప గడపకు మన ప్రభుత్వం

గూడూరు: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కప్పలదొడ్డి గ్రామంలో సోమవారం నుంచి నిర్వహిస్తామని ఎంపీడీఓ డి .సుబ్బారావు తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి స్థానికుల సమస్యలు తెలుసుకుంటారని చెప్పారు.

పోస్టుమాస్టర్ పద్మావతి సేవలు ప్రశంసనీయం

చల్లపల్లి: పోస్టల్ శాఖ ఉద్యోగినిగా, యూనియన్ నాయకురాలిగా పద్యాల పద్మావతి సేవలు ప్రశంసనీయమని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. ఆదివారం స్థానిక సీఆర్ వికాస కేంద్రంలో చల్లపల్లి పోస్ట్‌మాస్టర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన పద్మావతిని ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే రమేష్‌బాబు, నాయకుడు సింహాద్రి వికాస్‌బాబు, వైఎస్సార్ సీపీ చల్లపల్లి మండల ఇన్‌చార్జి ఇంకొల్లు శేషగిరి, పోస్టల్ శాఖాధికారులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం



గూడూరు: గూడూరు హైస్కూల్ ఆట స్థలంలో కల్నల్ సీకే నాయుడు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఐదు జట్లు పోటీపడ్డాయి. సీనియర్స్ విభాగంలో గూడూరు జట్టు, జూనియర్స్ విభాగంలో తరకటూరు జట్లు విజేతలుగా నిలిచాయి. విజేతలకు గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు బహుమతులు ప్రదానం చేశారు. రైల్వే బోర్డు మెంబర్ మోటేపల్లి రత్నారావు, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

కోనేరుసెంటర్: బందరు మండలం నెలకుర్రు గ్రామంలో జరుగుతున్న పేకాట శిబిరంపై బందరు రూరల్ పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 2,500లను స్వాధీనం చేసుకున్నారు. దాడిలో రూరల్ ఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

లక్ష తులసీ దళాలతో పూజ

ముదినేపల్లిరూరల్: రెండో పూరీగా ప్రసిద్ధి చెందిన మండలంలోని వడాలి శ్రీసుభద్ర బలరామ సహిత జగన్నాథస్వామి ఆలయంలో లక్ష తులసి పూజ ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ధనుర్మాసం సందర్భంగా ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో 20 మంది రుత్వికులు పూజను నిర్వహించారు.

సుబ్బారాయుడి ఆలయంలో భక్తుల రద్దీ


మోపిదేవి దేవస్థానంలో భక్తుల రద్దీ

మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున వచ్చిన భక్తులతో ఉదయం నుంచే క్యూలైన్లు అన్నీ నిండిపోయాయి. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తులు గంటల తరబడి నిరీక్షించారు. ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సాకేత్ కుటుంబానికి ఎమ్మెల్యే సింహాద్రి పరామర్శ


సాకేత్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి, కడవకొల్లు

ఘంటసాల(అవనిగడ్డ): ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘంటసాల మండలం సూరపనేనిపాలెంకు చెందిన పదో తరగతి విద్యార్థి కొక్కిలిగడ్డ సాకేత్ కుటుంబాన్ని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకుడు కడవకొల్లు నరసింహారావు ఆదివారం పరామర్శించారు. ప్రమాద వివరాలను తెలుసుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. వైఎస్సార్ సీపీ నేత చిట్టూరి రమేష్, శేఖర్‌బాబు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఘంటసాల(అవనిగడ్డ): ప్రమాదాలను నివారించేందుకు ఘంటసాల మండలంలోని జాతీయ రహదారిపై పలుచోట్ల సిగ్నల్ కోసం, స్పీడ్‌ని తగ్గించేందుకు స్టిక్కర్స్ ఉన్న ప్లాస్టిక్ డ్రమ్ములను ఏర్పాటు చేశామని ఎస్ఐ కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల యండకుదురు వద్ద జరిగిన ప్రమాదంలో ఇద్దరు మరణించడం చాలా బాధాకరమన్నారు. ప్రమాదాల నివారణకు ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని చెప్పారు. అతి వేగంగా వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వాహనదారులకు ఎస్ఐ సూచించారు.

హైదరాబాద్‌కు 26 ప్రత్యేక బస్సులు

అవనిగడ్డ: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని అవనిగడ్డ డిపో నుంచి హైదరాబాద్‌కు 26 ప్రత్యేక బస్సులను నడుపుతామని డిపో మేనేజర్ కె. హనుమంతరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 6వ తేదీ నుంచి 13వ తేదీ వరకు అదనపు చార్జీలు లేకుండా ఈ ప్రత్యేక సర్వీసులు నడుస్తాయని చెప్పారు. రానూ పోనూ టిక్కెట్లు తీసుకుంటే పదిశాతం రాయితీ, ఒకే కుటుంబంలో ఐదుగురు కంటే ఎక్కువగా ఉండి గ్రూపుగా టిక్కెట్లు బుక్ చేస్తే 5 శాతం రాయితీ ఇస్తున్నామని చెప్పారు. బీహెచ్ఈఎల్, కేపీహెచ్‌పీ, మియాపూర్, ఎస్ఆర్‌నగర్, ఈసీఐఎల్ నుంచి ఈ సర్వీసులు బయలు దేరతాయని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న డీఎం హనుమంతరావు

కల్వర్టును ఢీకొట్టిన కారు

వ్యక్తికి గాయాలు



కృత్తివెన్ను: రోడ్డు పక్క నున్న కల్వర్టును కారు ఢీకొట్టిన ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి మునిపెడ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం ప్రకారం.. కృత్తివెన్ను వైపు నుంచి బంటుమిల్లి వెళుతున్న కారు ప్రమాదవశాత్తు కల్వర్టును శనివారం అర్ధరాత్రి ఢీకొట్టింది. ప్రమాద సమయంలో కారులో ఒక వ్యక్తి మాత్రమే ఉన్నారు. తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు, రోడ్డుపై వెళుతున్న వాహన చోదకులు కారు నుంచి బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో కారు ముందుభాగం పూర్తిగా ధ్వంసమైంది.

పొత్తుల కోసం వెంపర్లాట

- అందుకే చంద్రబాబును కలిసిన పవన్ కల్యాణ్
- పవన్‌కల్యాణ్ తీరుపై ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆగ్రహం



అవనిగడ్డ: చంద్రబాబుతో పొత్తుల కోసం జనసేన అధినేత పవన్ కల్యాణ్ వెంపర్లాడుతున్నాడని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు విమర్శించారు. అవనిగడ్డలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కుప్పంలో చంద్రబాబుని అడ్డుకున్నారనే సాకుతో ఆయన్ను పవన్ కల్యాణ్ కలిసి జీఓ నంబర్ ఒకటిని వ్యతిరేకించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాపు రిజర్వేషన్ల కోసం దీక్ష చేస్తున్న కాపునేత ముద్రగడ పద్మనాభం కుటుంబాన్ని టీడీపీ ప్రభుత్వం పోలీసులతో కలిసి చిత్రహింసలకు గురిచేసినప్పుడు ఆ కుటుంబాన్ని ఎందుకు పలుకరించలేదని పవన్ కల్యాణ్‌ను ప్రశ్నించారు. విశాఖలో విద్యార్థులు చేపట్టిన సమైక్యాంధ్ర ఉద్యమంలో పాల్గొనడానికి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వెళితే ఎయిర్‌పోర్ట్ లోనే ఆపేసినప్పుడు పవన్ కల్యాణ్‌కు హక్కులు గుర్తుకు రాలేదా అని సూటిగా నిలదీశారు. ఆ రోజు సమైక్యాంధ్ర ఉద్యమంలో పాల్గొంటానని చెప్పిన పవన్ కల్యాణ్ ట్విట్టర్‌లో పోస్టులకే పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు.

టీడీపీతో చంద్రబాబుతో పొత్తు పెట్టుకునేందుకు పవన్ కల్యాణ్ తహతహ లాడుతున్నారని విమర్శించారు. ఎవరెన్ని పొత్తులు పెట్టుకున్నా, అన్ని పార్టీలు ఏకమై వచ్చి పోటీ చేసినా మళ్లీ వైఎస్సార్ సీపీకే ప్రజలు పట్టం కడతారని సింహాద్రి స్పష్టంచేశారు.

గిట్టుబాటు ధరకే ధాన్యం కొనుగోళ్లు

గుడ్లవల్లేరు: రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం గిట్టుబాటు ధరకు కొనుగోళ్లు చేస్తోందని కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ తెలిపారు. ఆదివారం వడ్లమన్నాడులో ఆమె పర్యటించారు. తొలుత రంగు మారిన ధాన్యాన్ని ఆమె పరిశీలించారు. రంగు మారిన ధాన్యానికి కూడా గిట్టుబాటు ధర వచ్చే విధంగా అధికారులకు తగు సూచనలు చేశారు. మిల్లుల యజమానులతో మాట్లాడి ధాన్యం కొనుగోళ్లపై ఆరా తీశారు. వ్యవసాయ కమిటీ జిల్లా కమిటీ సభ్యుడు పెన్నేరు ప్రభాకర్, రెవన్యూ, సివిల్ సప్లయ్ అధికారులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలకు విశేష స్పందన

పామర్రు: స్థానిక శివాలయం వద్ద ఉన్న లలిత కళాతోరణం వద్ద ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. గుంటూరుకు చెందిన జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ వారి సౌజన్యంతో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో సుగరు, బీపీలకు సంబంధించిన పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. భవిష్యత్‌లో తమ సంస్థ ద్వారా మరిన్నిసేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. శిబిరంలో పలు గ్రామాల నుంచి 100 మందికి పైగా రోగులు వచ్చిని ఉచిత వైద్య సేవలను పొందారన్నారు. కార్యక్రమంలో గుంటూరు గ్రీన్ సిటీ సంఘ అధ్యక్షుడు ఊద దినేష్‌కుమార్, మాజీ అధ్యక్షుడు భువన, కార్యదర్శి వి.శివకృష్ణ, ప్రాజెక్టు చైర్మన్ ఎస్.సూరిబాబు, సభ్యులు కొల్లా కొండబాబు, జి.సత్యనారాయణ, డి.శ్రీనివాస్, రాము తదితరులు పాల్గొన్నారు.

132 మందికి వైద్య పరీక్షలు..

గుడ్లవల్లేరు: బీజేపీ సీనియర్ నాయకుడు డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. 132 మంది రోగులు పాల్గొని సుగర్, బీపీ, ఎముకలు, కీళ్ల, నడుము, కామెర్లు, జ్వరాలు, దగ్గు, ఆయాసం, ఆస్తమా, గుండె జబ్బులు సాధారణ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గుండె శస్త్రచికిత్సలకు ఆరోగ్య శ్రీ కార్డుపై చికిత్సను అందిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు.

లయన్స్‌లో వైద్యశిబిరం..

లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరులో ఉచిత మధుమేహ వైద్య పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. 180 మందికి డాక్టర్ రజినీ వైద్య పరీక్షలు చేశారు. అనంతరం రోగులకు ఉచితంగా మందుల అందజేశారు.

శరవేగంగా అనివేటి మండప నిర్మాణం

కైకలూరు: అనివేటి మండప నిర్మాణం ద్వారా పెద్దింట్లమ్మ దేవస్థానానికి రాష్ట్ర వ్యాప్త కీర్తి దక్కుతోందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద మండప నిర్మాణ పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దాతల విరాళం రూ.4 కోట్లతో అనివేటి మండపాన్ని నిర్మిస్తున్నామన్నారు. ఇప్పటికీ దాదాపు 80 శాతం పనులు పూర్తయ్యాయని చెప్పారు. ఈ ఏడాది వచ్చే పెద్దింట్లమ్మ జాతర ఉత్సవాలకు మండపం భక్తులకు అందుబాటులోకి వస్తోందన్నారు. సమీప జిల్లాల్లో పెద్దింట్లమ్మ దేవస్థాన అనివేటి మండపం పెద్దది కావడం విశేషమన్నారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పెద్దింట్లమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కేవీ గోపాలరావు, గ్రామ పెద్దలు బలే సముద్రుడు, నాగరాజు, దేవస్థాన పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.


కొల్లేటికోటలో అనివేటి మండపాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు

డప్పు కళాకారుడు చాట్రగడ్డకు సన్మానం


శ్రీనివాసుడును సన్మానిస్తున్న వాకర్స్

చల్లపల్లి: డప్పు కళ ద్వారా చల్లపల్లికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిన కళాకారుడు చాట్రగడ్డ శ్రీనివాసుడు అని ఎస్ఆర్‌వైఎస్‌పీ కళాశాల వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎస్ఆర్‌వైఎస్పీ ఆవరణలో వాకర్స్ ఆధ్వర్యంలో డప్పు కళాకారుడు చాట్రగడ్డ శ్రీనివాసుడును ఘనంగా సన్మానించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ పోటీల్లో శ్రీనివాసుడు మొదటి బహుమతి సాధించిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. మండవ బాలవర్ధిరావు, అరజా రాజేంద్రప్రసాద్, మోర్ల రాంబాబు, అడపా గురవయ్య, కోనేరు బలరాం, కోళ్ల శేఖర్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పేకాట, చిత్తులాటపై పోలీసుల దాడులు

15 మంది జూదరుల అరెస్ట్

కోనేరుసెంటర్: బందరు మండలంలోని పలు గ్రామాల్లో పేకాట, చిత్తులాటలపై బందరు రూరల్ పోలీసులు ఆదివారం మెరుపుదాడి చేశారు. ఎస్ఐలు చాణక్య, సత్యనారాయణలు సిబ్బందితో కలిసి ఏకకాలంలో ఈ దాడులు చేసి జూదరులను అదుపులోకి తీసుకున్నారు. జిల్లా ఎస్పీ పి. జాషువా ఆదేశాల మేరకు సిబ్బంది దాడులు నిర్వహించారు. మండలంలోని చిన్నాపురంలో కొంత మంది పేకాట ఆడుతుండగా అందిన సమాచారం మేరకు ఎస్ఐ సత్యనారాయణ సిబ్బందితో కలిసి శిబిరంపై దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 3,380 స్వాధీనం చేసుకున్నారు. అలాగే తపసిపూడి గ్రామంలో పేకాట శిబిరంపై ఎస్ఐ చాణక్య సిబ్బందితో కలిసి దాడి చేసి నలుగురుని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 1500 స్వాధీనం చేసుకున్నారు. చీకటిపాలెంలో కొంతమంది చిత్తులాట ఆడుతుండగా దాడి చేసిన పోలీసులు మరో ఐదుగురిని పట్టుకుని వారి నుంచి రూ. 1,020 స్వాధీనం చేసుకున్నారు. మొత్తంగా మండలంలో పేకాట, చిత్తులాటలపై దాడి చేసిన పోలీసులు 15 మంది జూదరులను పట్టుకుని రూ. 5,900లను స్వాధీనం చేసుకున్నారు.

సాయం అందజేత

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): ఉత్తర చిరువోలు లంకకు చెందిన కొల్లాటి రాము ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. వైఎస్సార్ బీమా పథకం కింద బాధిత కుటుంబానికి సర్పంచ్ చింతా శ్రీనివాసరావు తక్షణ సాయంగా రూ. 10 వేలు అందజేశారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ కొప్పనాతి వెంకటేష్, సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- **మచిలీపట్నంటౌన్:** మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న కడప జిల్లాకు చెందిన రవి అనే వ్యక్తి తండ్రి లక్ష్మణ్‌కు స్థానిక బెరాకా మినిస్ట్రీస్ నిర్వాహకుడు కిరణ్‌పాల్ ఆదివారం రూ. 10,300 ఆర్థిక సాయం అందించారు. నగరంలోని బెరాకా మినిస్ట్రీస్ కార్యాలయానికి బాధితుడు వచ్చి కిరణ్ పాల్‌ను సాయం కోరడంతో ఆయన ఈ మొత్తాన్ని అందించారు. దాత కిరణ్‌పాల్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.


సాయం అందజేస్తున్న దృశ్యం

- **ఘంటసాల(అవనిగడ్డ):** ఘంటసాల మండల పరిధిలోని శ్రీకాకుళానికి చెందిన తానేటి రమణ కుటుంబానికి శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాంకిశోర్ నాయుడు వైద్యఖర్చుల కోసం రూ.6 వేలు ఆర్థిక సాయం అందించారు. పక్షవాతంతో బాధపడుతున్న వనిత స్వగృహం వద్ద ఆదివారం ఈ మొత్తాన్ని శ్యాంకిశోర్ నాయుడు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొండవీటి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వీఎం రంగా విగ్రహం ఆవిష్కరణ

కృత్తివెన్ను: పోడు గ్రామంలో ఏర్పాటు చేసిన వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని రాధా–రంగా మిత్ర మండలి రాష్ట్ర అధ్యక్షుడు వంగవీటి నరేంద్ర ఆదివారం ఆవిష్కరించారు. నరేంద్ర మాట్లాడుతూ దివంగత వంగవీటి మోహనరంగా పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కృషి చేశారని చెప్పారు. విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని నిడదవోలు నరసింహారావు కుమారులు వెంకటేశ్వరరావు, సోమేశ్వరరావులు ఇచ్చారన్నారు. పడవల సూర్యచంద్రరావు ఆర్థిక సహాయం అందించారని చెప్పారు. కార్యక్రమంలో బుల్లెట్ ధర్మారావు, చినిమిల్లి వెంకటరాయుడు, చేగొండి సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.


రంగా విగ్రహావిష్కరణలో నాయకులు

వేమూరి వెంకట్రావుకు సన్మానం

ఘంటసాల(అవనిగడ్డ): ఇటీవల ఘంటసాల మార్కెట్ యార్డు చైర్మన్‌గా ఎన్నికైన వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వేమూరి వెంకట్రావును పలువురు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. ఆయన స్వగృహం వద్ద వెంకట్రావును కలుసుకుని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చిలకలపూడి ఉప సర్పంచ్ పులి వెంకటేశ్వరరావు, నాయకులు కాకుల పూర్ణచంద్రరావు, మేరుగు నాగేశ్వరరావు, అన్నవరపు చంటి, రమేష్, జక్కుల శ్రీనివాసరావు, మండా శివ పాల్గొన్నారు.


వెంకట్రావును సన్మానిస్తున్న నాయకులు

కొండలమ్మకు మొక్కుబడుల సమర్పణ

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వేలాది సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తజనంతో కిటకిటలాడింది. అమ్మవారి దర్శనానికి క్యూలైనుల్లో భక్తులు వేచి ఉన్నారు. ముందుగా పాల పొంగళ్లను వండిన మహిళా భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ సురేష్ పర్యవేక్షించారు.

